నేడు వాహనాల వేలం

రాజేంద్రనగర్: శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం వేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ దేవేందర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉప్పర్‌పల్లిలోని స్టేషన్ ఆవరణలో మధ్యాహ్నం 12 గంటలకు ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు ఆటోలు, 13 ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు సూచించారు. ఆసక్తి గల వారు స్టేషన్ ఆవరణలోని వాహనాలను పరిశీలించుకోవాలని సూచించారు.

క్షయ వ్యాధిపై అవగాహన


క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

శంషాబాద్: క్షయ వ్యాధి నిర్మూలనకు వందరోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కొత్వాల్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పౌష్టికాహారం, మంచి వాతావరణంతో పాటు పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం రోగులకు హోమియోపతి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిమ్స్ ఆస్పత్రి వైద్యులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు, రేపు హెచ్‌సీయూలో వర్క్‌షాప్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రెండురోజుల జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను బుధ, గురువారాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, ఉన్నత భారత్ అభియాన్ కోఆర్డినేటర్ డాక్టర్ రావుల కృష్ణయ్య, భారత బయోటెక్ ఇంటర్నేషనల్ చైర్మన్ డాక్టర్ కృష్ణా ఎల్లా, ఎస్ఎస్ఈ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్‌శర్మ, ఐఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘణశ్యామ్ కృష్ణ, ఉన్నత్ భారత్ అభియాన్ ఎన్‌సీఐ న్యూఢిల్లీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీకే సింగ్ పాల్గొంటారు. గురువారం ఉదయం 11.30 గంటలకు జరిగే కార్యక్రమంలో భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యానాయుడు , చేవెళ్ళ పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎన్ఐఆర్‌డీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి నరేంద్ర కుమార్ పాల్గొంటారు.

ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



శేరిలింగంపల్లి: నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.పుష్ప డిమాండ్ చేశారు. మంగళవారం సమాఖ్య ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పుష్ప మాట్లాడుతూ అధిక ధరలతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని, రేషన్ షాపుల్లో 14 రకాల నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచడంతో పాటు సన్న బియ్యం కూడా అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి కళావతి, గ్రేటర్ అధ్యక్షులు అనిత, గ్రేటర్ హైదరాబాద్ కమిటీ సభ్యులు శివాని, రాణి, సుల్తానా బేగం, లలిత, విమల, రజియా బేగం, ఇందిర, అమీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

9న 'మనూ' వ్యవస్థాపక దినోత్సవం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈనెల 9వ తేదీన నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 'మనూ' ఛాన్స్‌లర్ ముంతాజ్ అలీ, గౌరవ అతిథిగా అలీఘడ్ ముస్లిమ్ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ తారీఖ్‌మన్సూర్ , రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ , ప్రొఫెసర్లు పాల్గొంటారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు నిర్మించాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ కోరారు. మంగళవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో కలసి డివిజన్ పరిధిలోని తారానగర్, రాజీవ్ గృహకల్ప, గోపీనగర్, నెహ్రూనగర్, బాపూనగర్‌లలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కాలనీల్లో రోడ్లు దెబ్బతినడంతో స్థానికులు ఇబ్బందులుపడుతున్నారని వివరించారు. పార్టీ డివిజన్ గౌరవాధ్యక్షులు వీరేశం గౌడ్, రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాకు సుస్తీ

మందుల కొరతతో రోగులకు తిప్పలు • అన్ని మందులు అందుబాటులో ఉంచుతాం: అధికారులు



మార్కండేయనగర్ బస్తీ దవాఖానా


బస్తీ దవాఖానా వైద్య బృందం

మైలార్‌దేవ్‌పల్లి: పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణను గాలికొదిలేయడంతో చాలా బస్తీ దవాఖానాల్లో సరైన వైద్య సేవలు అందడం లేదు. సరైన మందులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూపీహెచ్, పీఎస్‌సీ, డీఎంహెచ్ఓలకు ఇండెంట్ పెడితే మందులను విడతల వారీగా కొన్ని కొన్ని పంపుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. దీంతో వైద్యులు సైతం ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది.

◆ బాబుల్‌రెడ్డినగర్, మోహన్‌రెడ్డినగర్, సాయిబాబానగర్ బస్తీల ప్రజలు ఎక్కువగా మార్కండేయనగర్‌లో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాకు వస్తున్నారు. కొన్నేళ్లు అన్ని రకాల వైద్య సేవలు అందినా ఈ మధ్య సరైన సేవలు అందడం లేదు. మందులు లేక వైద్యులు బయట నుంచి కొనుగోలు చేసుకోండి చెబుతున్నారు. సంబంధిత అధికారులు బస్తీ దవాఖానాలో మందుల కొరత లేకుండా నిరుపేదలకు సరిపోయే మందులను పంపించాలని వేడుకుంటున్నారు.

బీపీ, షుగర్ ట్యాబ్లెట్లు తీసుకుంటున్నాను



మార్కండేయనగర్‌లో ఉన్న బస్తీ దవాఖానాలో వైద్యురాలితో పరీక్షలు చేయించుకొని బీపీ, షుగర్ ట్యాబ్లెట్లు తీసుకుంటున్నాను. కొన్ని నెలలుగా కొన్ని కొన్ని ట్యాబ్లెట్లు ఇస్తున్నారు. నెలకు సరిపడే ట్యాబ్లెట్లు ఒకేసారి ఇవ్వాలని కోరుతున్నాను.

– భాస్కరచారి, బాబుల్‌రెడ్డి నగర్

మందుల కొరత ఉంది..



బస్తీ దవాఖానాలో వచ్చే రోగులకు సరైన పరీక్షలు చేసి వైద్యం అందిస్తున్నాను. సరిపడ మందులు లేకపోవడంతో కొన్నికొన్ని ఇస్తున్నాను. కొందరు పేషెంట్‌లు మాత్రం నాపై గొడవకు దిగుతున్నారు. మందులు ఎందుకు ఇవ్వవని గొడవలు చేస్తున్నారు. ప్రతిరోజు రోగుల సంఖ్య పెరుగడంతో మందులు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నాను. ప్రతినెల షుగర్ పేషంట్లు నెలకు సరిపడే మందులు ఇవ్వాలని అడుగుతున్నారు. కొరత ఉండటంతో కొన్నికొన్ని అందరికి వచ్చేలా ఇస్తున్నాను.

– ఉదాఫిర్దౌస్, వైద్యురాలు

మందుల కొరత లేకుండా చూస్తాం..

బస్తీ దవాఖానాకు మందుల కోసం బడ్జెట్ సపరేటుగా అలాట్ చేయలేదు. పీహెచ్‌సీ నుంచి అక్కడి స్టాఫ్ వచ్చి తీసుకోవాలి. మందుల కొరత ఏమీ లేదు. బస్తీ దవాఖానా వారు వచ్చి తీసుకోవాలి. గతంలో ఇచ్చిన మందులు ఇప్పుడు ఇస్తున్నాం. రెండురోజుల్లో ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తాం. అందరికీ మందులు అందేలా చూస్తాం.

– వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ

విద్యార్థులు సమాజంపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న లింగం సుధాకర్‌రెడ్డి

బండ్లగూడ: విద్యార్థులు చదువుతో పాటు సమాజంపై అవగాహన పెంచుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదా ధామంలో నిర్వహిస్తున్న 10వ తరగతి ప్రతిభా విద్యార్థుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిశు మందిర్ విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా ఉంటూ ఇక్కడ నేర్చుకున్న విలువలను దైనందిన జీవితంలో పాటిస్తూ తాము నేర్చుకున్న విలువలను ఇతరులకు కూడా నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. నిత్య జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, నీటిని వృథా చేయరాదని సూచించారు. కార్యక్రమంలో విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షులు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు, చక్రవర్తుల కృష్ణమాచార్యులు, చంద్రశేఖర్‌గుప్తా, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి


బృందావన్ కాలనీలో పర్యటిస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాలాజీనగర్, లక్ష్మిగూడ, బృందావన్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా చూడాలని, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం రేణుక, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జనార్దన్, హనుమంత రెడ్డి, తలారి చిన్న, పాండు, రంజిత్‌సింగ్, రాజు, శంకర్, స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విరాళం


నగదు అందజేస్తున్న రవి ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ 3 ప్రతినిధులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యున్నతికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు రవి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ 3 సంస్థ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం పద్మశాలిపురం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు సంస్థ తరఫున రూ. 20 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించేందుకు తమ వంతు చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్వాన్ నియోజకవర్గంలో అర్హులందరూ సంక్షేమ పథకాలకు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు ధరఖాస్తు చేసుకునే వారు మీ సేవా కేంద్రంలో గానీ, తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించి అవసరమైన ధృవపత్రాలన్నిటిని సిద్ధం చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారికి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు సయ్యద్ రఫత్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

లంగర్‌హౌస్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ప్రకటించిన కామారెడ్డి ఓబీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని కార్వాన్ నియోజకవర్గ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ర్యాలీగా గోల్కొండ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీలకు కేటాయించే బడ్జెట్ రెండు సంవత్సరాలకు కలిపి రూ.40 వేల కోట్లు కేటాయించాలన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడి అమానుషం


మాట్లాడుతున్న హరికిషన్‌జీ

రాజేంద్రనగర్: యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వీధి రౌడీల్లా వ్యవహరిస్తూ బీజేపీ కార్యాలయంపై దాడి చేయడం దారుణమని రంగారెడ్డి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా కార్యదర్శి హరికిషన్‌జీ అన్నారు. మంగళవారం ఆయన శివరాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా కర్రలు, రాళ్లతో దాడి చేయడం దారుణమన్నారు. నాయకుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజమని, శాంతియుతంగా నిరసనలు తెలపాలన్నారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా దాడులకు పాల్పడిన వారిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. బీజేపీ కార్యాలయంపై దాడికి నిరసనగా ఆందోళన చేపట్టిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు.

జాతీయ సదస్సుకు ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గం: హెచ్‌సీయూలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్, పొలిటికల్ సైన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజుల సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9,10 తేదీలలో 'అండర్ స్టాండింగ్ ఎలక్టోరల్ ఔట్ కమ్స్ ఇన్ ఇండియన్ స్టేట్స్, లోక్‌సభ ఎన్నికలు–2024' అనే అంశంపై సదస్సు ఉంటుంది. ప్రారంభ సమావేశంలో న్యూఢి ఢిల్లీలోని లోక్‌నీతి సీఎస్‌డీఎస్ ప్రొఫెసర్ సంజయ్ కుమార్, పొలిటికల్ సైన్స్ మాజీ ప్రొఫెసర్ కేసీ సూరి, ప్రొఫెసర్లు ఈ వెంకటేష్, డాక్టర్ డి వీరబాబు పాల్గొంటారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

రాజేంద్రనగర్: ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ అన్నారు. మంగళవారం శివరాంపల్లి ప్రాంతంలోని ఎంఎస్ జూనియర్ కళాశాలలో ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలన్నారు. జీబ్రా లైన్ వద్దే రోడ్డు దాటాలని, రెడ్ సిగ్నల్ పడిన వెంటనే వాహనాన్ని ఆపివేయాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 300 మంది విద్యార్థులకు రెండు షిఫ్టులుగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బంది ట్రాఫిక్ సూచికలు తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తవ్విన గుంతలను పూడ్చండి


జలమండలి డీఈకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: పైప్‌లైన్లు, మరమ్మతు పనుల కోసం తవ్విన గుంతలను వెంటనే పూడ్చి ప్రమాదాలను నివారించాలని బీఆర్ఎస్ నాయకులు జలమండలి అధికారులను కోరారు. మంగళవారం మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం ఆధ్వర్యంలో పలువురు నాయకులు డీఈని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ హుడాకాలనీ, లాలమ్మగార్డన్, అంజలిగార్డన్ వద్ద పైప్‌లైన్, మరమ్మతు పనుల కోసం జలమండలి సిబ్బంది గుంతలను తవ్వి అలాగే వదిలేశారన్నారు. దీంతో స్థానికులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. గండిపేట నుంచి హైదరాబాద్ నగరానికి నీటిని తరలిస్తున్న క్యాండూట్‌కు పలు చోట్ల లీకేజీలు ఏర్పడి నీరు వృథా కావటంతో పాటు రోడ్లు పాడవుతున్నాయన్నారు. దీనిపై జలమండలి డీఈ మహేందర్‌నాయక్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు లక్ష్మణ్ రావు, జి.నరేందర్, జి.విఠల్, ఎస్. శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మి, బి.శ్రీధర్, సుమ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'బీఐఎంఎల్'ను ప్రారంభించిన ఏఐసీ టీహబ్


కార్యక్రమంలో టీహబ్ తాత్కాలిక సీఈఓ సుజిత్ జాగిర్దార్ , వివిధ సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: భారతదేశపు ప్రముఖ స్టార్టప్ ఇంక్యుబేటర్ మంగళవారం ఏఐసీ టీహబ్ ఫౌండేషన్ మార్గదర్శకత్వంలో 'బిజినెస్ ఇంక్యుబేషన్ మేనేజ్‌మెంట్ అండ్ లీడర్‌షిప్(బీఐఎంఎల్) ప్రోగ్రామ్‌ను లాంఛనంగా ప్రారంభించింది. శిక్షణ, వ్యూహాత్మక పరిజ్ఞానం, పరిశ్రమల అనుసంధానంతో ఇంక్యుబేటర్‌లకు సాధికారత కల్పించేందుకు ఈ కార్య క్రమం రూపొందించబడింది. ఏఐసీ టీహబ్ ప్రోగ్రామ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా ఎడ్యుటెక్, అకాడెమియా, స్పోర్ట్స్, టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ ఇంక్యుబేషన్ రూపొందిస్తోంది. 15 విద్యాసంస్థల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. దేశంలో బలమైన, డైనమిక్ ఇంక్యుబేషన్ ఎకోసిస్టమ్‌ను పెంపొందిడమే లక్ష్యమని ఏఐసీ టీహబ్ ఫౌండేషన్ ఈఈఓ రాజేష్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీహబ్, ఏఐసీటీహబ్ ఫౌండేషన్, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీపై అవగాహన కల్పించాలి

హెచ్‌సీయూ వీసీ


పోస్టర్‌ను ఆవిష్కరించిన వీసీ బీజే రావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్

రాయదుర్గం: హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ)పై క్యాంపస్‌లో అవగాహన కల్పించాలని హెచ్‌సీయూ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు అధికారులను ఆదేశించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ హెల్త్ సెంటర్ క్యాంపస్‌లో మంగళవారం వైరస్‌పై అవగాహన కార్యక్రమం, పోస్టర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపస్‌లో పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని, ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందు జాగ్రత్తలపై పోస్టర్లను అంటించి అవగాహన కల్పించాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్‌లో వైరస్ వ్యాప్తి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ వైద్యాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు


ట్రోఫీతో అకాడమిక్ హెడ్ జాస్మీన్ బేగం

గోల్కొండ: విద్యార్థులను వారు ఇష్టపడిన రంగాల్లో ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని గోల్కొండ ఉర్వా మాడల్ హై స్కూల్ అకాడమిక్ హెడ్ జాస్మీన్ బేగం అన్నారు. ఆల్ ఇండియా నిల్లత్ కౌన్సిల్ ఆధ్వర్యంలోనిర్వహించిన అండర్–15 బాలుర ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఉర్వా హై స్కూల్‌కు చెందిన యూసుఫ్ ఆలీఖాన్ టీమ్ విజేతగా నిలిచింది. 8 టీమ్‌లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో అత్యధిక గోల్స్ చేసి యూసుఫ్ ఆలీఖాన్ బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం యూసుఫ్ ఆలీఖాన్‌ను పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో సహనియత్ ఉన్నీసా, తబస్సుంబేగం, ఫహమీనా ఉన్నీసా తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి


మంచిరేవులలో మహాప్రస్థానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


నార్సింగిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

మణికొండ: నియోజకవర్గ పరిధిలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 6, 9, 10,11,13, 15, 18 వార్డులలో రూ.5.60 కోట్లతో చేపట్టిన పలు కమ్యూనిటీ హాల్‌లు, మోడ్రన్ లైటింగ్, వైకుంఠ ధామాలు, డివైడర్‌లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో ఏటా పెరుగుతున్న కాలనీలు, జనాభాకు అనుగుణంగా సమస్యలు పెరుగుతున్నాయన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లోనూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కొనసాగిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ జి.విజయ్‌బాబు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నాయకులు వేణుగౌడ్, దశరథయాదవ్, మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి, డీఈ నరేష్‌కుమార్, ముంగి జైపాల్‌రెడ్డి, కిరణ్, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, లంకల పాపిరెడ్డి, కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

నేడు మణికొండలో ఎమ్మెల్యే పర్యటన

మున్సిపాలిటీ పరిధిలో రూ. 5.06 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బుధవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పర్యటించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.